క్లుప్తంగా

రాజ్యాంగంతోనే ప్రజలకు రక్షణ

సీతంపేట : దేశ ప్రజల హక్కులను రక్షించే పాత్రను భారత రాజ్యాంగం పోషిస్తుందని మాజీ ఐపీఎస్ అధికారి కె.రాజశిఖామణి అన్నారు. ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్వర్క్ (ఐడీజేఎన్) ఆధ్వర్యంలో శనివారం రామాటాకీస్ రోడ్‌లోని అంబేద్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం ఆవశ్యకత, పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికపై దేశ ప్రజలకు గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఘనత బి.ఆర్.అంబేద్కర్‌కు దక్కిందన్నారు. కుల, మత, లింగ, ప్రాంతీయ, సాంస్కృతిక అసమానతలను రాజ్యాంగం రూపుమాపిందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి మీడియా ప్రధాన పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో ఏయూ లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కోట పల్లవి, అధ్యాపకురాలు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ, డాక్టర్ రమేష్‌బాబు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్యాకేజీతో 'గైస్' విద్యార్థులకు ఉద్యోగాలు



గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణతో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

మురళీనగర్ : అల్ట్రా సిమెంట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు ఉత్తమ వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. కాలేజీలో చదువుతున్న ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగానికి చెందిన ముగ్గురు, ఆయిల్ టెక్నాలజీ విభాగానికి చెందిన ముగ్గురు, కెమికల్ విభాగానికి చెందిన ఒక విద్యార్థికి ఏడాదికి రూ.4లక్షల ప్యాకేజీతో కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు. ఇతర విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు జయప్రకాష్‌రెడ్డి, ప్రశాంతకుమారి, దామోదర్, విజయలక్ష్మి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం నివేదించారు. 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం విశేష హారతి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం



ముస్తాబవుతున్న ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా ఎర్నికుమార్, కొయ్య జగదీష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆంజనేయ శర్మ నేతృత్వంలో ఆ రోజు తెల్లవారు జామున 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. 7గంటల నుంచి స్వామివారికి విశేష పూజలు, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

- మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికల్లో హామీ
- అధికారంలోకి వచ్చాక అమలు చేయని కూటమి ప్రభుత్వం
- వాయిదాలతో కాలయాపన చేస్తున్న చంద్రబాబు
- బాబును నమ్మి మోసపోయామని మహిళల ఆవేదన

ఉచిత బస్సు హుళక్కే



గురుద్వార్ బస్ బే వద్ద ప్రయాణికులు



సీతమ్మధార

అంతన్నాడింతన్నాడే చంద్రబాబు... సూపర్ సిక్స్ పథకాలన్నాడే చంద్రబాబు... ఆ సూపర్ సిక్స్ పథకాలు గాలికొదిలేశాడే చంద్రబాబు... అంటూ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలపై ప్రజలు పాటలు పాడుకుంటున్నారు. అధికారంలోకి రావడానికి అమలు సాధ్యం కాని హామీలిచ్చిన చంద్రబాబు నాయుడు... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వాటిని పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలంటూ పెద్ద ఎత్తున కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం మానేశారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో దసరా, సంక్రాంతి అంటూ రోజుకొక మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో సర్వత్రా కూటమి ప్రభుత్వంపై మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు. గురుద్వార్, అక్కయ్యపాలెం, రేసపువానిపాలెం, ఎంఎంటీసీ కాలనీ, నక్కవానిపాలెం, ఆశీలమెట్ట, మద్దిలపాలెం, మురళీనగర్, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో అధికంగా పేద ప్రజలు, వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని కాలేజీలకు, కార్యాలయాలకు మహిళలు, విద్యార్థినులు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని ఖచ్చితంగా అమలు చేయాలని వారంతా కోరుతున్నారు.

పండగల పేరుతో కాలయాపన

మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు. పండగలు వస్తున్నాయి, వెళ్తున్నాయి కానీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై కూటమి నాయకులు స్పష్టమైన ప్రకటన చేయడం లేదని మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని మహిళలు కోరుతున్నారు. పథకం అమలు చేస్తే వేలాది మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని పలువురు ఆశగా ఎదురుచూస్తున్నారు.



గురుద్వార్ జంక్షన్ వద్ద బస్ కోసం వేచి ఉన్న ప్రయాణికులు



రేసపువానిపాలెం బస్టాప్ వద్ద వేచి ఉన్న మహిళలు

హామీలు అమలు చేయాలి

సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ప్రతి పండగకు పథకం అమలు చేస్తామంటూ చెబుతున్నారే తప్ప ఆచరించడం లేదు. మహిళలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రజలు ఓట్లేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేయడం సరికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత బస్సు హామీపై మహిళలకు సమాధానం చెప్పాల్సిందే.

– ఎస్.రామలక్ష్మి, బొడ్డపాలెం, ఆనందపురం

మహిళలకు నమ్మక ద్రోహం

కూటమి నాయకుల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. ఇదిగో.. అదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం సరికాదు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

– సాడి పద్మారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్, 24వ వార్డు

హామీ ఇవ్వడమెందుకో..?

మహిళలను ఆకర్షించేందుకు ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని కూటమి నేతలు హామీనిచ్చారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పథకం గురించి మాట్లాడకపోవడం దారుణం. మహిళలకు హామీ ఇచ్చిన ప్రకారం ఉచిత బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎస్.కాంతమ్మ, కంచరపాలెం

ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో స్వచ్ఛ ఆంధ్ర



కంటి ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న వైద్యులు

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను తరలించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ రమణ, ప్రేమలత, ఆర్ఎంవో డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, జూనియర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, తదితరులు

మద్దిలపాలెం : నగరంలోని వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కోసం తాటిచెట్లపాలెం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పద్మజ సుజుకి జీఎం రఫి శనివారం తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు, సురక్షితమైన డ్రైవింగ్ ఎలా చేయాలో అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్టు విభాగం, సుజుకి కంపెనీ సిబ్బందితో భారీ బైకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ప్రమాదాలు తగ్గించడానికి చర్యలు చేపడుతున్నామని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణాలు సాగించాలని ఎస్ఐ కోరారు.

దళిత ఐపీఎస్ అధికారిని వేధించడం తగదు



సంఘీభావం ప్రకటిస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

సీతంపేట : గత ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పని చేసిన ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్ పట్ల ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును దళిత సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మామిడి శ్రీనివాస్ మాట్లాడుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పదే పదే మాట్లాడటం సరికాదన్నారు. దళితులు ఏ ప్రభుత్వానికీ వ్యతిరేకం కాదని, సునీల్ కుమార్‌పై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నూటికో కోటికో ఒక్కరు మా ఎస్సీ సమాజం నుంచి శక్తి సామర్థ్యాలతో ఉన్నతాధికారులుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఆ విధంగా ఉన్నతాధికారిగా ఎదిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ ఒకరని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన ఆయన అప్పటి విధానాలు, ఆదేశాల ప్రకారం వృత్తి ధర్మంలో భాగంగా కొంత మంది రాజకీయ నాయకులపై తన సబార్డినేట్ అధికారులతో చట్టపరమైన చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం మారగానే సునీల్‌కుమార్‌ను రాజకీయ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. విరసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంటకరావు మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న రఘురామకృష్ణంరాజు తను చేసిన ప్రమాణానికి భిన్నంగా, పదవిని దుర్వినియోగం చేసి సునీల్ కుమార్‌ను అరెస్టు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అంబేద్కర్ భవన్ కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ సునీల్‌కుమార్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదని, పోస్టింగ్ ఇవ్వకుండా అవమానించడం కుల వివక్ష కాదా..? అని ప్రశ్నించారు. సమావేశంలో బీమ్ సేన వార్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, వేమన, ఓంకార్, జల్లి రాజశేఖర్, ముత్తాబత్తుల రమేష్, ఆకుల శ్యామ్, మామిడి రాజు, సోడదాసి సుధాకర్, కోరమాటి చిన్నారావు, రేణుకుమార్, వేమన్న, బూల భాస్కరరావు పాల్గొని సునీల్‌కుమార్‌కు సంఘీభావం ప్రకటించారు.

ఉత్తమ పద్ధతులతో బోధించాలి



మాధవధార క్లస్టర్ సమావేశంలో ఉపాధ్యాయులు

మురళీనగర్ : బోధనాభ్యసన ప్రక్రియల్లో ఉత్తమ పద్ధతులు అమలు చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు సూచించారు. ఏఎస్సార్‌నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయడంతోపాటు వెనుకబడిన విద్యార్థుల్లో కనీసం అభ్యసన స్థాయిలు సాధించే విధంగా ప్రణాళిక తయారు చేసుకుని అమలు చేయాలన్నారు. బోధనాభ్యాసన పద్ధతుల అంతిమ లక్ష్యం ఉత్తమ లక్ష్యాల సాధనేనని వివరించారు. గుణాత్మక ఫలితాల సాధనకు బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమలు చేయాలని సూచించారు.

అర్థవంతంగా క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలు

మాధవధార ఉన్నత పాఠశాల, అల్లూరి సీతారామరాజునగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలల క్లస్టర్‌లలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశాలు అర్థవంతంగా సాగాయి. మాధవధార ఉన్నత పాఠశాల పరిధిలోని ఏడు పాఠశాలల నుంచి 82 మంది ఉపాధ్యాయులకు 76 మంది హాజరయ్యారు. హెచ్‌ఎం బి.హేమలత ఆధ్వర్యంలో పది తరగతి గదులను ఉపాధ్యాయులకు కేటాయించి ప్రతీ తరగతి గదిలోనూ ఐఎఫ్‌పీ ప్యానెల్, ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. మాధవధార హెచ్‌ఎం బి.హేమలత, కప్పరాడ హెచ్‌ఎం విజయ మాలిని పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశానికి భీమిలి డైట్ లెక్చరర్ ఎం.మహాలక్ష్మి పరిశీలకురాలిగా వచ్చారు. ఎస్ఈఆర్‌టీ యూట్యూబ్ లింక్ ద్వారా ప్రసారం చేసిన మోడల్ లెసన్ ప్లాన్లు, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన సబ్జెక్టు వారీ బెస్ట్ ప్రాక్టీసెస్‌తోపాటు హాట్ టాపిక్స్‌ను సులువుగా బోధించే విధానాలకు సంబంధించిన వీడియోలను వీక్షించారు. ఎస్ఈఆర్‌టీ కార్యాలయం నుంచి రాష్ట్ర ఉన్నతాధికారుల సందేశాలను వీక్షించారు. 117 జీవోకు సంబంధించి చర్చించారు. కొందరు ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను చెప్పారు. క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను గూగుల్ ఫారం ద్వారా సేకరించారు.



సమావేశంలో హెచ్‌ఎం రాంప్రసాద్, తదితరులు

ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి

సీతమ్మధార : స్కూల్ కాంప్లెక్స్ సమావేశం స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. సీతమ్మధార మండలానికి సంబంధించి నక్కవానిపాలెం, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ స్కూళ్ల టీచర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం రాంప్రసాద్ తెలిపారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి విజయరామరాజు ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్కూలులో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ - 2 బాలమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో భాగస్వాములవ్వాలి



పాలిటెక్నిక్‌లో స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిస్తున్న విద్యార్థినులు




ఈపీడీసీఎల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్



నక్కవానిపాలెంలోని శ్మశానం పరిసర ప్రాంతాల్లో చెత్త తొలగిస్తున్న అధికారులు

విశాఖ సిటీ : స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సీజీఎంలు డి.సుమన్ కళ్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీతమ్మధార రైతుబజారులో చెత్త తొలిగిస్తున్న ఈవో, రైతులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్వచ్ఛ ఆంధ్ర శనివారం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజీ పరిసరాల్లోని చెత్తను తొలగించారు. ప్రయోగశాలలను శుభ్రపరిచారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు. మురళీనగర్ పరసరాల్లోని వివిధ పాఠశాలల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు.

సీతమ్మధార : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత పాల్గొన్నారు.

- స్థానిక రైతుబజార్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్'లో భాగంగా బజారు అంతా పరిశుభ్రం చేశారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ ఆధ్వర్యంలో రైతులు చీపుర్లు చేతపట్టి పరిశుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు లక్ష్మి, సాంబమూర్తి, మదన్, తదితరులు పాల్గొన్నారు.
- నక్కవానిపాలెం శ్మశానం పరిసరాల్లో జోన్ – 3 వైద్యాధికారుల ఆధ్వర్యంలో చెత్త తొలగించి శుభ్రం చేశారు.

తల్లి చెంతకు తమిళనాడు యువకుడు

సీతమ్మధార : మతిస్థిమితం కోల్పోయి విశాఖలో తిరుగుతున్న యువకుడిని నాలుగో పట్టణ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని రైల్వే న్యూ కాలనీలో 32 ఏళ్ల మతిస్థిమితం లేని యువకుడు దారిన పోయే వారిపై రాళ్లతో దాడి చేస్తున్నాడని ఈ నెల 12న అందిన ఫిర్యాదుతో కానిస్టేబుల్ రవి కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సదరు మతిస్థిమితం లేని వ్యక్తిని స్థానికుల సహాయంతో బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద గల పోలీస్ స్టేషన్‌కి తరలించారు. సదరు వ్యక్తి తమిళంలో మాట్లాడడంతో మరో కానిస్టేబుల్ వర్మ సాయంతో విచారించగా... తన పేరు ముత్తులిగం ఏసుదాసు అని, తమిళనాడు రాష్ట్రంలోని కడలూరి జిల్లాకి చెందినవాడినని తెలియజేశాడు. అనంతరం ముత్తులిగం మానసిక స్థితి దృష్ట్యా చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించారు. అతను చెప్పిన వివరాల ప్రకారం తమిళనాడులోని తల్లిని సంప్రదించగా ఆమె శనివారం విశాఖ చేరుకున్నారు. మూడేళ్ల కిందట జరిగిన గొడవలో తలకి గాయం కావడంతో మతి స్థిమితం కోల్పోయి ఇంటి నుంచి పారిపోయాడని తెలిపారు. ఆమెను ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకెళ్లి ముత్తులింగాన్ని కానిస్టేబుళ్లు అప్పగించారు. కొద్ది రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జి చేస్తామని అక్కడి వైద్యులు తెలిపారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న యల్లపు రఘురామ్, గొర్లె చందు, తదితరులు

కంచరపాలెం : విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ బాక్సర్లు హైదరాబాద్‌లో జరిగిన జీజీకే బాక్సింగ్ ప్రొఫెషనల్ లీగ్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. విజేతలు హరికిషోర్, శివకుమార్, కె.శ్రీనివాస్‌ను శనివారం డీఎల్‌బీ గ్రౌండ్‌లో నిర్వహించిన అభినందన సభలో ఘనంగా సత్కరించారు. విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ ప్రమోటర్ యల్లపు రఘురామ్, కార్యదర్శి వాసుపల్లి అమ్మోరు, విశాఖ పోర్ట్ యూనియన్ నాయకుడు గొర్లె చందు విజేతలను సత్కరించి మరిన్ని అవార్డులు సాధించాలని అభినందించారు. కార్యక్రమంలో ఐబీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.సునీల్, జడ్జి వాదాడ రూలిన్, కోచ్ బాదంపూడి వాసు, అడ్వయిజర్ సతీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సమావేశం నేడు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ పార్కులోని సభా ప్రాంగణంలో వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో రానున్న కాలంలో నిర్వహించే పలు సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చిస్తామని చెప్పారు. ఉదయం 8 గంటలకు సమావేశం నిర్వహిస్తామని, సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

డిక్లరేషన్‌లో ఆడపిల్లలకు చోటివ్వడం హర్షణీయం

తాటిచెట్లపాలెం : రైల్వేలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆడపిల్లలను కూడా శాశ్వత కుటుంబ సభ్యులుగా గుర్తిస్తూ రైల్వే ఉద్యోగుల ఫ్యామిలీ డిక్లరేషన్ రికార్డుల్లో వారి పేర్లు కూడా నమోదు చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలివ్వడంపై సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మార్పు వల్ల వివాహం కాని ఆడపిల్లలను, వివాహానంతరం వితంతు జీవితం అనుభవిస్తున్న కూతురు, డైవర్స్‌డ్ కుమార్తెలకు కూడా ఉద్యోగి మరణానంతరం ఆయన ప్రయోజనాలు పొందే వీలుంటుందని తెలిపారు. అనేక విజ్ఞప్తులు, వినతుల అనంతరం ఈ అవకాశం కల్పించిన రైల్వే బోర్డుకు కృతజ్ఞతలు తెలియజేశారు.